ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

■ నోటీసులు జారీ చేసిన పంచాయతీ కార్యదర్శి
■ పట్టించుకోని ఇంటి యజమాని

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టరాదని సూచిస్తున్న ప్రత్యేకాధికారి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ

వికారాబాద్, మే 26 : గ్రామానికి ఆ బావి నీరే ప్రధాన ఆధారం. ప్రస్తుతం మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఏదైనా సమస్య వచ్చి రాకపోతే... మళ్లీ ఈ బావి గ్రామస్తుల దాహార్తిని తీరుస్తుంది. ఆ బావిని ఓ ఇంటి యజమాని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇందుకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి మూడు నోటీసులు అందినా పట్టించుకోకపోవడం గమనార్హం. వికారాబాద్ మండలం గొట్టిముక్కల గ్రామంలోని మైసమ్మ ఆలయం వెనుక ఉన్న పెద్ద బావికి ఎన్నో ఏండ్ల చరిత్ర ఉంది. బావి దగ్గరలో ప్రభుత్వ భూమి (గ్రామ పంచాయతీ స్థలం)లో ఒక ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన దాని కంటే ఎక్కువ స్థలంలో పనులు సాగిస్తున్నాడు. ఎన్నో ఏండ్ల నుంచి బావి వద్ద ఉన్న పైప్ లైన్లను తొలగించి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇప్పటికే మూడు నోటీసులు సైతం ఇచ్చారు. గ్రామానికి ప్రత్యేక అధికారిగా ఉన్న తహసీల్దార్ లక్ష్మీ నారాయణ సైతం ఈ పనులను పర్యవేక్షించి వెంటనే నిలుపుదల చేయాలని సూచించారు.

పనులు ఆపాలని నోటీసులు ఇచ్చాం

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మధుకర్‌రెడ్డిని అడుగగా బావి దగ్గర అక్రమ నిర్మాణం జరుగుతున్న మాట వాస్తవమే అన్నారు. . ఏన్నో ఏండ్లుగా ఉన్న బావి పైపు కనెక్షన్లు తీసివేశారని పేర్కొన్నారు. పైపు కనెక్షన్ తొలగించి పిల్లర్ గుంతలు తీశారని, ఇప్పటికే ఆ పనులు ఆపాలని నోటీసులు ఇచ్చామన్నారు. గ్రామ ప్రత్యేకాధికారి కూడా పనులు ఆపాలని చెప్పినా వినడం లేదని తెలిపారు. పై స్థాయి అధికారుల ఆదేశాల మేరకు వేచి చూస్తున్నామని తెలిపారు.


గుండాల గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు

ప్రకృతి వనం.. వికృత రూపం..

ఎండుతున్న చెట్లు.. నిర్లక్ష్యంతో హరిత లక్ష్యానికి తూట్లు

దోమ, మే 26 : గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ కరువై చెట్లు ఎండుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరు స్పష్టంగా గోచరిస్తున్నది. తెలంగాణను హరిత తెలంగాణగా మార్చాలనే లక్ష్యంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికీ ఓ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి విరివిగా మొక్కలు నాటి వాటి నిర్వహణను గ్రామ పంచాయతీలకు అప్పజెప్పింది. దానికి భిన్నంగా దోమ మండల పరిధిలోని గుండాల గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు సరైన సమయంలో నీరు అందించకపోవడంతో చెట్లు ఎండిపోయాయి. పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్ మొక్కల పెంపకానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీకి ఒక ట్రాక్టర్‌తో పాటు ట్యాంకర్‌ను సమకూర్చింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనంలోని చెట్లను కాపాడాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలు గ్రామాల్లోని ప్రకృతి వనాల్లో నీరు లేక ఎండిపోతున్న చెట్లు
పట్టించుకోని అధికారులు.. సంరక్షించాలంటున్న జనం

ఆత్మరక్షణకు కరాటే దోహదం

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, మే 26 : ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో దోహదం చేస్తుందని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులారమేశ్ తెలిపారు. ఆదివారం వికారాబాద్ మిషన్ స్కూల్ గ్రౌండ్‌లో వేసవి సెలవుల్లో భాగంగా కరాటేలో విద్యార్థులకు ఉచిత శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆమె సర్టిఫికెట్టు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినీవిద్యార్థులు చిన్నతనంలోనే కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. గత ఏప్రిల్ 26 నుంచి మే 26 వరకు ప్రముఖ కరాటే మాస్టర్ ఖాజా పాషా (ఎంజేఎస్‌కేఏఐ) మాస్టర్ జపాన్ షోటో ఖాన్ కరాటే డూ ఇండియా టీమ్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. విద్యార్థుల సామర్థ్యం మేరకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ శిబిరంలో షాద్‌నగర్‌కు చెందిన విద్యార్థిని పి.లక్ష్మి బ్లాక్ బెల్ట్ సాధించారన్నారు. సమ్మర్ క్యాంపులో వికారాబాద్, తాండూరు, చేవెళ్ల, షాద్‌నగర్ ప్రాంతాలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎండీ హఫీజ్, కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, కరాటే మాస్టర్లు ఖాజా పాషా, డి.విజయ్ పాల్గొన్నారు.

ఈశ్వరప్పకు సేవారత్న అవార్డు

డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న వీరశైవలింగాయత్ లింగబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప

కులకచర్ల, మే 26 : బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. గత 20 ఏండ్లుగా లయన్స్ క్లబ్ ద్వారా తెలంగాణ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సామాజిక సేవల సాధికారిత కోసం విశేషంగా కృషి చేశారు. దీంతో ఈశ్వరప్ప సేవారత్నకు ఎంపికయ్యారు. శనివారం బెంగళూరులోని పరాగ్‌హోటల్‌లో మదర్ థెరెస్సా విశ్వవిద్యాలయం ఆస్ట్రేలియా ద్వారా నిర్వహించిన అవార్డును డాక్టరేట్ పట్టాను ప్రొఫెసర్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఆర్ సరస్వతి, సీఈవో డాక్టర్ జాన్ ఎంస్ట్రోమ్ అందజేశారు. ఈ సందర్భంగా వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ.. నేటి యువతరం రేపటి సమాజం కోసం కృషిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎంపికపై పలువురు బీజేపీ నాయకులు, వీరశైవలింగాయత్ లింగబలిజ సంఘం నాయకులు అభినందించారు.

క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణం

పెద్దేముల్, మే 26 : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని పెద్దేముల్ ఎస్సై కె.గిరి అన్నారు. మండల కేంద్రంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న అన్వర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్(పెద్దేముల్ ప్రీమియర్ లీగ్ సీజన్-02)లో విజేతలకు ఆదివారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు సోదర భావంతో క్రీడలు ఆడాలన్నారు. టోర్నమెంట్ నిర్వహించిన అన్వర్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. టోర్నమెంట్‌లో విజేతగా రహీం-11 పెద్దేముల్ నిలువగా, రన్నర్ విజేతగా రైసింగ్-11 నిలిచింది. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా మోహన్, బెస్ట్ బౌలర్‌గా ఎన్.నవీన్ ప్రతిభను కనబర్చారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు సి.కృష్ణ, ఆర్గనైజర్లు సల్మాన్, రహీం, బాబర్, సద్దాం, గయాజ్, జావిద్, రవీందర్, తన్వీర్, అలీబాబా, జమీర్, సమీర్, ప్రసాద్, ప్రవీణ్, చిన్న, అశోక్ గౌడ్, పిల్లి వెంకట్, అంబి, భీమేశ్, రాము, వెంకట్, ఇస్మాయిల్, మైమూద్ తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎస్సై గిరి

అపూర్వ సమ్మేళనం

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వికారాబాద్, మే 26 : ఆనందం, ఉద్వేగం, ఆప్యాయ పలకరింపులు, చిన్ననాటి జ్ఞాపకాలు, చిలిపి ముచ్చట్లు అక్కడంతా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. ఆదివారం మోమిన్‌పేట మండలంలోని మేకవనంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అపూర్వ సమ్మేళనం ఇందుకు వేదికైంది. 1999-2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులందరూ ఒక చోటకు చేరారు. వారంతా 25 ఏండ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులు, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. మిత్రుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నప్పుడు చేసిన అల్లరి, గురువుల బెత్తం దెబ్బలు ఇలా అన్నీ గుర్తు చేసుకున్నారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. పాఠశాల విద్య తర్వాత జీవితంలో జరిగిన ఒడిదుడుకులను చెప్పుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరూ ఎక్కడెక్కడ ఏయే పనులు చేస్తున్నారో వివరాలు తెలుసుకున్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి దేశంలో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

బషీరాబాద్, మే 26 : ఎన్నికల శిక్షణ ముగించుకొని ఇంటికి వస్తూ ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయురాలి కుటుంబానికి పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ ఆదివారం ఆర్థిక సహాయం అందజేసింది. మండల కేంద్రంలోని టాకీ తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న రాణి ఎన్నికల శిక్షణ కోసం ఈ నెల ఒకటో తేదీన తాండూరుకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో తీవ్ర అస్వస్థత గురై మృతి చెందింది. పీఆర్‌టీయూ శాఖలో క్రియాశీల సభ్యత్వం ఉన్న సందర్భంగా ఆమె కుటుంబానికి పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ తరపున రూ.లక్ష చెక్కును జిల్లా శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్, మండల శాఖ అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, కార్యదర్శి ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, మండల అధ్యక్ష, గౌరవ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రవికాంత్, ఎంఈవో సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర సభ్యులు మహేశ్ కుమార్, ఈశ్వర్, జిల్లా సభ్యులు హీర్యానాయక్, హన్మంత్ నాయక్, గోవింద్, మండల సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, మాలానా, యాదగిరి, భీమప్ప, మధుసూదన్‌గౌడ్, తదితరులు ఉన్నారు.


చెక్కు అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

వ్యక్తి ఆత్మహత్య

బంజారాహిల్స్,మే 26: ఇటీవల భార్య, తండ్రి చనిపోవడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన కొండవీటి శివ (48) బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని ఇందిరా నగర్‌లో బ్యాంగిల్ స్టోర్ నడిపించాడు. ఏడాది క్రితం అతడి భార్య అనారోగ్యంతో చనిపోగా, నెలరోజుల క్రితం తండ్రి కూడా మరణించాడు. దీంతో శివ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం తొమ్మిది దాటినా శివ ఇంట్లోంచి బయటకు రాలేదు. గమనించిన ఇంటి యజమాని విషయాన్ని సమీపంలోనే ఉంటున్న అతడి బావమరిది రవికి సమాచారమిచ్చాడు. దీంతో వారిద్దరూ ఇంటి తలుపులు పగలగొట్టి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన శివ మృతదేహం కనిపించింది. ఈ మేరకు రవి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

యువకుడిని మింగిన క్వారీ గుంత

స్నేహితులతో కలిసి ఈతకెళ్లి మృతి

ఆదిబట్ల, మే 26 : క్వారీ గుంత యువకుడిని మింగింది. స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లగా అందులో పడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ వెనుక జరిగింది. ఆదిబట్ల ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. మంగళ్‌పల్లికి చెందిన సయ్యద్ ఆరిఫ్(33) ఆదివారం స్నేహితులతో కలిసి కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ వెనుక ఔటర్ రింగురోడ్డు నిర్మాణం కోసం తవ్విన క్వారీ గుంతలోని నీటిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. స్నేహితులు ఈత కొట్టి బయటికి రాగా.. ఆరిఫ్ మాత్రం నీటిలోనే మునిగిపోయాడు. ఆందోళన చెందిన స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని గజ ఈతగాళ్లను రప్పించి.. క్వారీ నుంచి ఆరిఫ్ మృతదేహాన్ని తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలి

చేవెళ్లటౌన్, మే 26 : రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. క్వింటాల్ వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇ ప్పటివరకు చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. రైతు భరోసా కింద ఎన్నికల్లో చెప్పినట్లు ఎకరాకు రూ. 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేయ డంతో పాటు రైతులకు అండగా నిల్చున్న ప్ర భుత్వం బీఆర్ఎస్ అని తెలిపారు. ఇప్పటి కైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన వరి ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

యాలాల, మే 26: టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. యాలాల మండల పరిధిలోని కోకట్ శివారులోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ధరఖాస్తు చేయడానికి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్.ఏసీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

కులకచర్ల, మే 26 : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌లో పడగాళ్ల భీమయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సీనియర్ పార్టీ నాయకులు పడగల బాలయ్య, పెంటయ్య, రాములు, చంద్రయ్య, షర్వోద్దీన్, రాములు, భీంభాస్కర్, చిన్నపులింగ వెంకటేశ్, కారోబార్ యాదయ్య, రాజు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న కొండల్‌రెడ్డి

కొండల్‌రెడ్డికి డాక్టరేట్ పట్టాను అందజేస్తున్న గ్లోబల్ హ్యూమన్స్ పీస్ యూనివర్శిటీ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ న్యాయమూర్తి

మర్పల్లి, మే 26 : మండలంలోని పంచలింగాల్‌కు చెందిన ఎస్‌కేఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి శనివారం డాక్టరేట్ అందుకున్నారు. ఎస్‌కేఆర్ ట్రస్ట్ ద్వారా జిల్లాలో ఆయన చేసిన సేవలను గుర్తించి తమిళనాడులోని గ్లోబల్ హ్యూమన్ పీస్ ఇంటర్నేషనల్ పర్చువల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పీపుల్ ఫోరం ఆఫ్ ఇండియా భారత్ సేవక్ ప్రతినిధులు చెన్నైలోని భారతీయ విద్యా భవన్‌లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు డాక్టరేట్ పట్టాను అందజేశారు. గ్లోబల్ హ్యూమన్స్ పీస్ యూనివర్శిటీ వ్యవస్థాపకుడు డాక్టర్ మానుఎల్, రిటైర్డ్ న్యాయమూర్తి డాక్టర్ వెంకటేశన్ చేతుల మీదుగా కొండల్‌రెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కొండ ల్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ డాక్టరేట్ పట్టాతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. సేవలను గుర్తించినందుకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కొండల్‌రెడ్డిని అభినందించారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

వికారాబాద్, మే 26 : నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ, పీడబ్ల్యూడీ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీఆర్ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లు అధ్వానంగా మారాయని, బంట్వారం, కోటిపల్లి, ధారూరు, మర్పల్లి, మోమిన్‌పేట, వికారాబాద్ ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు పడ్డాయని తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

వెంగళరావునగర్, మే 26: హైటెన్షన్ విద్యుత్తు తీగలు తగిలి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎనిమిదేళ్ల బాలిక ప్రాణాలు విడిచింది. మహబూబాబాద్ కేసముద్రంకు చెందిన ఎనిమిదేళ్ల బాలిక వేసవి సెలవులను గడిపేందుకు రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్ఎస్‌బీ.నగర్‌లో ఉంటున్న తాతయ్య యాకయ్య ఇంటికి వచ్చింది. మేడపై ఉన్న మూడో అంతస్తుపై బాలిక మెటల్ టేప్‌తో ఆడుకుంటూ విద్యుత్ షాక్‌కు గురైన విషయం తెలిసిందే. మూడు రోజులుగా గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం ప్రాణాలు విడిచింది. పాప మృతితో రహ్మత్‌నగర్ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఏక్‌మామిడి నుంచి నవాబుపేటకు వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా మారిన కల్వర్టు

వంతెన.. అంతేనా?

■ ఏక్‌మామిడి సమీపంలో అసంపూర్తిగా కల్వర్టు నిర్మాణం
■ పొంచి ఉన్న ప్రమాదం.. ■ పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

నవాబుపేట, మే 26 : మండల పరిధిలోని ఏక్‌మామిడి సమీపంలో నిర్మిస్తున్న కల్వర్టు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ప్రమాదం పొంచి ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏక్‌మామిడి బంగారు మైసమ్మ ఆలయం నుంచి నవాబుపేట వరకు బీటీ రోడ్డు నిర్మించారు. అయితే కల్వర్టు పనులు పూర్తి కాలేదు. ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు నరకయాతన పడుతున్నారు. భయం భయంగా ప్రయాణం చేస్తున్నారు. కల్వర్టుపై మట్టి వేసి ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఈ ప్రధాన రోడ్డుపై నుంచే నిత్యం మైనింగ్ బండ్లు, శంకర్‌పల్లికి, మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే బస్సులు, కూరగాయల బండ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంత ప్రమాదం పొంచి ఉన్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. రోడ్డు నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్ సిద్ధంగా ఉన్నా పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని పలువురు వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. కల్వర్టుకు ఇరువైపులా దిమ్మెలు ఏర్పాటు చేసి వాటి చుట్టూ మట్టి పోసి అసంపూర్తిగా వదిలివేశారు. వర్షాకాలంలో కల్వర్టు వద్ద రోడ్డు వర్షం నీటికి కొట్టుకుపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. ఎలాంటి ప్రమాదాలు జరుగకముందే మరమ్మతులు చేపట్టేలా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మృతి చెందిన మేకలు

మందపై వీధికుక్కల దాడి

13 మేకలు మృతి

మొయినాబాద్, మే 26 : వీధి కుక్కలు మేకల మందపై దాడి చేయడంతో 13 మేక లు మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని అమ్డాపూర్ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కుమ్మరికుంట దేవేందర్, లలితలు మేకలను పెంచుకుంటూ జీవిస్తున్నారు. ప్రతిరోజూ మాదిరిగానే శనివారం కూడా వారు మేకలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం సమయంలో ఇంటి వద్దే ఉన్న మందలో ఉంచారు. కాగా రాత్రి సమయంలో వీధి కుక్కలు ఒక్కసారిగా ఆ మందపై దాడి చేసి 13 మేకలను పట్టి చంపాయి. ఆ దంపతులు ఆదివారం ఉదయం లేచి చూసేసరికి మేకలు మృతి చెంది ఉన్నాయి. జీవనోపాధి కోసం పెంచుకున్న మేకలు మృతి చెందడంతో వారు కన్నీరు మున్నీరయ్యారు. వాటి విలువ రూ.లక్ష ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన శ్రీ మహమ్మద్ రహ్మత్ తండ్రి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, గ్రా॥ వల్లభ్‌నగర్, మహబూబ్‌నగర్ టౌన్, జిల్లా॥ మహబూబ్‌నగర్ వాస్తవ్యులు స్వార్జితం క్రింద సంపాదించిన ఆస్థిని తనఖా పెట్టుకొని శ్రీరామ్ ఫైనాన్స్ షాద్‌నగర్ బ్రాంచి వారు లోన్ ఇవ్వడానికి నిశ్చయించినారు, కావునా ఎవరికైనా ఇట్టి ఆస్థిపై ఆక్షేపణలు గాని ఆరోపణలు గాని ఉన్న యెడల 3 రోజులలోగా మా బ్రాంచి నందు సంప్రదించగలరు, లేనిచో ఈ యొక్క ఆస్థిపై ఎలాంటి వివాదాలు లేనిదిగా పరిగణించి మా క్లైంటు ముందుకు కొనసాగుతాడు,

ఆస్థి వివరాలు: గ్రామము: అన్నసాగర్, మండలము: భూత్పూర్, జిల్లా: మహబూబ్‌నగర్, అన్నసాగర్‌లో గల గృహము నం. 3-7, బ్లాకు నెం. 3 గల గృహము, 160 చదరపు గజములు కలదు.

హద్దులు: తూర్పు: ఖాళీ స్థలము, పడమర: ఖాళీ స్థలము, ఉత్తరము: చల్మల పెంటమ్మ గారి గృహము, దక్షిణము: కచ్చ రోడ్డు.

K. CHANDRA MOULI, B.Com., LLB
Advocate, New Gunj, Hanuman Nagar, Mahabubnagar. Cell: 9440330760